







గుడిపాల మండలం పిళ్లారికుప్పం గ్రామం వద్ద ఓ ఈత చెట్టుకు పక్షులు కట్టుకున్న గూళ్లు ఇవి. రోడ్డు పక్కనే వుండడంతో ఆ దారంట వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.



పనులు జరుగుతున్న నగరి రాజీవ్‌నగర్ ప్రాంతం

ప్రమాదాల దారి



● గత శనివారం కార్వేటినగరం నుంచి వస్తున్న కారును రామాపురం వద్ద బస్సు ఢీకొనడంతో ముందు భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ఎయిర్‌బ్యాగ్ ఓపెన్ కావడంతో అందులో వున్న విద్యార్థులు, పీఈటీ మాస్టర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

● పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం వద్ద గత ఆదివారం రాత్రి తమిళనాడు ఆర్టీసీ బస్సు రాంగ్ రూట్‌లో వస్తుండడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న యువకుడు అదుపు తప్పి నిర్మాణ దశలో ఉన్న కల్వర్టుపై పడ్డాడు.దీంతో కడుపులో ఇనుప మేకు గుచ్చుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల సహాయంతో 108 సిబ్బంది ఆ మేకు కత్తిరించి తిరుపతి రుయా వైద్యశాలకు తరలించారు.

నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు నుంచి తిరుత్తణి వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయి.రహదారి పనులు ఒక వైపు జరుగుతుండగా వాహన రాకపోకలు సాగుతున్నాయి.దీంతో రహదారి ఇరుకుగా మారడంతో అమిత వేగంతో వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.వాహనాల వేగ నియంత్రణకు, సూచిక బోర్డులు కానీ, బారికేడ్ల ఏర్పాటు కానీ చేపట్టని కారణంగా ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.నగరి సాయిబాబా ఆలయ సమీపాన రహదారి అంచుల్లో ఉంచిన ఇసుక బస్తాలు తరచూ జారిపోవడంతో వాటిలో నుంచి ఇసుక రోడ్డుపై పడడం.... వాహనదారులు గుర్తించక జారిపడడం జరుగుతోంది. టేక్ డైవర్షన్ బోర్డులను దగ్గరగా ఉంచడం వల్ల డ్రైవర్లు గమనించక పోవడం, హఠాత్తుగా మలుపు తీసుకోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో రోడ్డు పక్కనే ఉన్న పల్లపు ప్రాంతాలు కనిపించకపోవడం వల్ల కూడా పరిస్థితి ప్రమాదకరంగా మారింది.

భద్రతా నియమాల లోపం

పుత్తూరు-తిరుత్తణి జాతీయ రహదారి పనుల్లో భద్రతా నియమాలు పాటించడం లేదు.నగరి సాయి బాబా ఆలయ సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక బస్తాలు తరచూ జారిపోవడం, వాహన దారులు గుర్తించక జారిపడి ప్రమాదాలకు గురవడం జరుగుతోంది. రాత్రి సమయంలో రిఫ్లెక్టివ్ సైన్‌లు ఉండడం లేదు.వీటిపై నేషనల్ హైవే ప్రధాన అధికారికి లేక రాశాం.

- కె.వేలాయుధం,
బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, నగరి



● హైవే విస్తరణ పనుల్లో భద్రతా లోపాలు
● పుత్తూరు - తిరుత్తణి రూట్లో వరుస యాక్సిడెంట్లు





ప్రమాదంతో కడుపులో ఇనుప మేకు గుచ్చుకున్న యువకుడు - రోడ్డు ఇరుకు కావడంతో రాత్రి వేళ వాహనాలు అదుపుతప్పి వెళుతున్న పల్లపుప్రాంతం



ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న మలుపు

ఇలా చేయాలి

- తగిన దూరాల్లో అదనపు 'టేక్ డైవర్షన్' బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అవసరమైన రహదారి సూచన చిహ్నాలు, లైన్ మార్కింగ్స్, రెఫ్లెక్టింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- సూచిక బోర్డులు రాత్రి వేళలో కూడా కనిపించే రేడియంతో అమర్చాలి.
- పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక బారికేడ్లు, హెచ్చరిక కోన్లు ఏర్పాటు చేయాలి.

ఇంటికో ఇండస్ట్రియలిస్టు లక్ష్యం

● ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

చిత్తూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.చిత్తూరు రూరల్ మండలం పైప్ వెంకటాపురంలోని 68 ఎకరాల్లో రూ.14.30కోట్లతో తలపెట్టిన ఇండస్ట్రియల్ పార్కుకు మంగళవారం ఆయన వర్చువల్‌గా భూమిపూజ చేశారు.అలాగే పుంగనూరు మండలం చదళ్ల గ్రామంలో 21.80 ఎకరాల విస్తీర్ణంలో రూ.9.50 కోట్ల వ్యయంతో ఒక ఇండస్ట్రియల్ పార్కుకు, నగరి మండలం మాంగాడు గ్రామంలో రూ.17.30 కోట్ల వ్యయంతో 20 ఎకరాల్లో మరో పార్కుకు,కుప్పం మండలం పాలార్లపల్లెలో రూ.206.16 లక్షలతో ఐదెకరాల్లో ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా యువత ఎదగాలన్నారు.ఈ సందర్భంగా చిత్తూరుకు చెందిన మైథిలి అనే మహిళ మాట్లాడుతూ ఆర్‌జే రిఫైనరీ పేరుతో వేస్ట్ ఆయిల్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను జీడీనెల్లూరులోని ఏపీఐఐసీ పార్కులో ఏర్పాటు చేసేందుకు ఏప్రిల్ నెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.ప్రభుత్వం నెలలోపు మంజూరు చేయగా, పరిశ్రమ పనులు ప్రారంభించడం జరిగిందన్న ఆమె ప్రభుత్వ సహకారం మర్చిపోనన్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 20 మందికి పరోక్షంగా 20 మందికి జీవనోపాధి కల్పించనున్నామని వివరించారు. ఈ సందర్భంగా మైథిలిని సీఎం చంద్రబాబు అభినందించారు.కలెక్టర్ సుమిత్‌కుమార్,చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఎన్.మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు చంద్రప్రకాష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.నగరిలో ఎమ్మెల్యే భానుప్రకాష్, కుప్పంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే హుడా చైర్మన్ సురేష్‌బాబు, పుంగనూరులో టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



కుప్పంలో సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్సీ, టీడీపీ నేతలు



కేంద్ర మంత్రుల నుంచి అవార్డు అందుకుంటున్న రవికుమార్,శోభారాణి

జిల్లాకు 'జన్‌భాగ్‌దారి' అవార్డు

సదుం/చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో మన జిల్లా.. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి 'జన్‌భాగ్‌దారి' అవార్డుకు ఎంపికైంది. మంగళవారం గుంటూరులో నిర్వహించిన వాటర్ షెడ్ నేషనల్ లెవల్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ద్వారా ఈ అవార్డును డ్వామా పీడీ రవికుమార్, ప్రాజెక్టు అధికారి శోభారాణి అందుకున్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కార్యక్రమంలో భాగంగా సదుం మండలం చెరుకువారిపల్లె వాటర్‌షెడ్ ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా 211పనులు చేపట్టి రూ.3.28కోట్లు ఖర్చు చేశారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 617 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఈ అవార్డుతో చెరుకువారిపల్లె వాటర్ షెడ్ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరో రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులను సహజ వనరుల యాజమాన్యం కింద ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించినట్లు డ్వామా పీడీ రవి కుమార్ తెలిపారు.

చిత్తూరు ఏడీఏ సావిత్రికి జరిమానా

● రాయచోటిలో పనిచేసినప్పుడు పరాకాష్టకు చేరిన అవినీతి ఫలితం

● సాటి ఉద్యోగుల నుంచే లంచాలు వసూలు చేయడంపై నాలుగేళ్ల విచారణ

కలికిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న సావిత్రికి జరిమానా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అన్నమయ్య జిల్లా రాయచోటిలో పనిచేసిన కాలంలో ఆమె కింది ఉద్యోగుల నుంచి లంచాల కోసం పీడించినట్లు ఆరోపణలొచ్చాయి. నాలుగేళ్లుగా దీనిపై కొనసాగిన విచారణ అనంతరం సావిత్రి వైపు నుంచి సంజాయిషీలు, వివరణలు తీసుకున్న తరువాత తాజాగా ఆమెకు రెండు ఇంక్రిమెంట్లు పూర్తి సర్వీసు కాలంలో (క్యుమ్యులేటివ్ ఎఫెక్ట్‌తో) కోత విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.డబ్బులు డిమాండ్ చేస్తూ ఏడీఏ సావిత్రి వేధింపులు భరించలేక రాయచోటి డివిజన్‌లోని సచివాలయ వ్యవసాయ, పశుసంవర్థక సహాయకులు, వీఎస్‌ఏలు, ఎంపీఈవోలు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అప్పటి కడప జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహించి సావిత్రి నిర్వాకాలపై 2021 మే 15 ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కమిషనరును ప్రభుత్వం ఆదేశించింది. సావిత్రి నుంచి వివరణలు తీసుకున్న అనంతరం గుంటూరు జేడీఏ వి.డి.కె.కృపాదాస్‌ను, డీడీఏ ఎన్‌సీహెచ్ బాలూనాయక్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఆ తరువాత గుంటూరు అదనపు డైరెక్టర్ బి.ప్రసాద్ చేత కూడా విచారణ జరిపించారు. మొత్తం మీద అన్ని విచారణల్లోనూ సావిత్రి అవినీతికి పాల్పడ్డట్లు పూర్తి ఆధారాలున్నట్లు నివేదికలు ప్రభుత్వానికి అందాయి. చివరిసారిగా సావిత్రి వైపు నుంచి వివరణలు తీసుకున్న అనంతరం ఆమె పూర్తి సర్వీసు కాలంలో రెండు ఇంక్రిమెంట్లు కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.



షంషీర్‌కు కాంస్య పతకాన్ని ప్రదానం చేస్తున్న ఎస్పీ తుషార్

'జూడో క్లస్టర్' క్రీడల్లో కానిస్టేబుల్ ప్రతిభ

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్-2025 క్రీడల్లో చిత్తూరు కానిస్టేబుల్ షంషీర్ ప్రతిభ చూపాడు. జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో గతనెల ఎనిమిది నుంచి 13వ తేదీవరకు జరిగిన క్రీడల్లో పెన్‌కాక్ సిలాట్ విభాగం 60 కిలోల కేటగిరీలో షంషీర్ మూడోస్థానంలో నిలిచి.. కాంస్యపతకాన్ని సాధించాడు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్‌ను ఎస్పీ తుషార్ పతకాన్ని ఆయన మెడలో వేసి అభినందించారు.

కాణిపాకంలో వైభవంగా విశేష ద్రవ్యాహుతి



ప్రధాన ఆలయం నుంచి పూజాద్రవ్యాలను తీసుకొస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా వరసిద్ధుడి ఆలయంలో విశేష ద్రవ్యాహుతిని వేదపండితులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఏఈవో రవీంద్రబాబు తన సిబ్బందితో కలసి పూర్ణాహుతి పూజా ద్రవ్యాలను ఉదయం అలంకార మండపం ఉన్న కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అక్కడ సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను కొలువుదీర్చి విశేష సంధి, రెండవ కాలపూజ, స్థండిలమండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, రెండవ పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, దీపారాధన చేశారు. సాయంత్రం విశేషసంధి, మూడవకాలపూజ, స్థండిలమండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, దీపారాధనను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.




సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు హారతి ఇస్తున్న పండితులు

టేకుమంద సమీపంలో 13 ఏనుగుల మంద దాడులు

వరి, అరటి, మామిడి పంటలకు నష్టం

7


శ్రీవారి సేవలో ప్రముఖులు

కార్తికేయ మిశ్రా - ఎంవీ నరసింహారావు - శోభా చంద్రశేఖర్

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ సీఎం అడిషనల్ సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండియన్ మాజీ క్రికెటర్ ఎంవీ నరసింహారావు, తమిళహీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ ఉన్నారు.



బంగారు పతకాలు, ప్రశంసాపత్రంతో వెంకటేష్

వృద్ధాప్యంలోనూ తగ్గేదేలే...

● ఈత పోటీల్లో తిరుపతివాసుల ప్రతిభ

తిరుపతి(క్రీడలు), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గత ఆదివారం జరిగిన 6వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతికి చెందిన ఎ.వెంకటేష్(67), సి.జయశంకర్(58) ప్రతిభ కనబరిచారు. వేర్వేరుగా బ్యాక్, బ్రెస్ట్ స్ట్రోక్, ఫ్రీస్టయిల్ విభాగాలలో వెంకటేష్‌కు నాలుగు బంగారు, జయశంకర్‌కు రెండు చొప్పున సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. దీంతో నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిరువురు స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో స్విమ్మింగ్ శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీవో శశిధర్, కోచ్ చక్రవర్తి, పలువురు క్రీడాకారులు, ప్రముఖులు వారిని అభినందించారు.



సిల్వర్, బ్రాంజ్ పతకాలు, ప్రశంసాపత్రంతో జయశంకర్


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.01 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 76,096

తలనీలాలు సమర్పించినవారు: 26,289



ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే..!

● ఎస్పీ సుబ్బరాయుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ అనేది సరదా కాదనీ, అదొక అమానుషమైన విషయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎవరైనా ఎక్కడైనా ర్యాగింగ్‌కు పాల్పడినట్టు తమ దృష్టికి వస్తే జైలుకు పంపి కఠిన శిక్ష అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో మంగళవారం స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ కొత్తగా యూనివర్సిటీలో అడుగు పెట్టిన విద్యార్థులను భయపెట్టకుండా స్నేహపూర్వకంగా ప్రోత్సహించడం ప్రతి సీనియర్ బాధ్యత అని గుర్తు చేశారు. ర్యాగింగ్ ద్వారా ఎవరికీ ఆనందం రాదని, ఎదుటివారికి మానసిక క్షోభను కలిగిస్తుందన్నారు. అలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ర్యాగింగ్ ఘటనపై ఫిర్యాదు చేసిన వారికి పూర్తి రక్షణ, న్యాయం అందిస్తామని వివరించారు. ఎస్వీయూ వీసీ నరసింగరావు మాట్లాడుతూ.. ర్యాగింగ్ అనేది విద్యార్థి జీవితాన్ని దెబ్బతీసే దుర్మార్గమైన అలవాటన్నారు. మన యూనివర్సిటీలో ప్రతీ విద్యార్థి సురక్షిత వాతావరణంలో చదువుకునే హక్కు ఉందన్నారు. ఆ హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రెక్టార్ అప్పారావు మాట్లాడుతూ.. చదువుతో పాటు మంచి ప్రవర్తనను విద్యార్థులు అలవరుచుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఇందుకోసం నిరంతరం సాధన చేయాలని కోరారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడమంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, సీడీసీ డీన్ చెంద్రాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విమానాశ్రయంలో హైఅలర్ట్



రేణిగుంట నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో దేశంలోని ముఖ్యమైన విమానాశ్రయాలకు కేంద్ర ఇంటెలిజెన్స్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో విమానాశ్రయ సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి గాజులమండ్యం పోలీసులు ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ భద్రతా సిబ్బంది, సీఐ మంజునాథ్ రెడ్డి, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం



పాంటర్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీనిరాజు, సన్నారెడ్డి

సత్యవేడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జర్మనీలోని సాక్సోని రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణ శాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌళిక వసతుల, విభిన్న రంగాల పరిశ్రమల ఎకో సిస్టం, అంతర్జాతీయ పెట్టుబడి దారులకు ఒనగూరే వ్యూహాత్మక వ్యాపార ప్రయోజనాలను డాక్టర్ సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కు పైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, క్నాఫ్, కాంక్యో బర్డ్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే బారత ప్రభుత్వం అందిస్తున్న పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడి దారుల అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అనుకూలతలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రణాళిక, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి అనుకూల విధానాలను ప్రశంసించిన పాంటర్ భవిష్యత్తులో మరిన్ని జర్మన్ సంస్థలు ఇక్కడ నెలకొల్పడానికి ఆసక్తి చూపుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతినిధిబృందం స్థానిక బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్ పరిశ్రమను సందర్శించి, కార్యకలాపాలను పరిశీలించింది.

ట్రై మోటారు సైకిళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు మూడుచక్రాల మోటారు వాహనాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడుచక్రాల మోటారు వాహనాలను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 25 నాటికి 18 సంవత్సరాలు పైబడి 45 లోపల ఉండాలని తెలిపారు. సదరం ధ్రువీకరణ ప్రకారం 70శాతం అంతకంటే ఎక్కువ ఉన్నవారు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు దాటకూడదన్నారు. మోటారు వాహనచట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.



అధికారులకు అవగాహన కల్పిస్తున్న బయాలజిస్టు రమేష్

పులుల గణనపై అటవీ అధికారులకు శిక్షణ

మంగళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో పులుల గణన ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా తిరుపతిలోని బయోట్రిమ్‌లో తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 20మంది ఎఫ్ఆర్వోలు, ఇద్దరు బయాలజిస్టులు, సిబ్బదికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. పులు గణన ఎలా చేపట్టాలి, ట్రాప్ కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై బయాలజిస్ట్ రమేష్ అవగాహన కల్పించారు. కొంతకాలం క్రితం శేషాచల అటవీప్రాంతంలో ఉనికి గుర్తింపుతో శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. శేషాచలాన్ని టైగర్‌కారిడార్‌గా ప్రకటించిన నేపథ్యంలో పెద్దపులులు సంచారం ఉందో లేదో త్వరలోనే స్పష్టంకానుంది. జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు బబిత, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ శుద్ధి



ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం తదితరులు

తిరుచానూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఈనెల 17న ప్రారంభం కానున్న పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9గంటల వరకు అధికారులు, అర్చకులు, సిబ్బంది ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలతో కలగలిపిన పవిత్రజలాన్ని ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

10 పరదాలు బహూకరణ

హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి తన ప్రతినిధుల ద్వారా అమ్మవారి ఆలయానికి మంగళవారం 7 పరదాలు, అదేవిధంగా తిరుపతికి చెందిన మణి 3 పరదాలను అందించారు. వీటిని ఆలయ అధికారులకు అందజేశారు.

17 నుంచి బ్రహ్మోత్సవాలు

ఈనెల 17న ఉదయం ధనుర్లగ్నంలో జరిగే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి చిన్న శేష వాహనం, 18న ఉదయం పెద్ద శేష, రాత్రి హంస.. 19న ముత్యపు పందిరి, సింహ.. 20న కల్పవృక్ష, హనుమంత.. 21న పల్లకీ ఉత్సవం, గజ వాహనం.. 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గరుడ వాహనం.. 23న సూర్యప్రభ, చంద్రప్రభ.. 24న రథోత్సవం, అశ్వ వాహనం, 25న పంచమీ తీర్థం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 8 నుంచి 10గంటల వరకు, రాత్రి 7 నుంచి 9గంటల వరకు వాహనసేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో అన్ని రకాల ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.



పరదాలు సమర్పించిన దాతలు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.



భారీ యాక్షన్ డ్రాప్‌లో

కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

మోటారు వాహనాలకు దివ్యాంగులు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల శాఖ ఇన్‌చార్జి ఏడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి పది మోటారు వాహనాలు మంజూరవుతాయన్నారు. 2025 నవంబరు 25వ తేదీనాటికి 18-45ఏళ్ల లోపు ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించరాదు. అభ్యర్థి గతంలో వాహనాన్ని తీసుకుని ఉండకూడదు. సహాయ పరికరం లేకుండా నడవకల్గినవారు అనర్హులు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. అర్హులైనవారు www.apdascac.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏడీ వివరించారు.

బడుల్లో మౌలిక సదుపాయాలు, టీచర్ల వివరాలు పక్కాగా ఉండాలి

● డీఈవో వరలక్ష్మి



ఎంఈవోలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు సూచనలిస్తున్న ఐటీ విభాగ అధికారులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు, టీచర్ల వివరాలు పక్కాగా ఉండాలని డీఈవో వరలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంఈవోలకు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, కేడర్ స్ట్రెంత్ నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశం జరిగింది. డీఈవో మాట్లాడుతూ.. బడిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎంతమంది టీచర్లు ఉన్నారు.. ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయన్న వివరాలు సబ్జెక్టులవారీగా తప్పుల్లేకుండా నమోదు చేయాలని చెప్పారు. చిత్తూరు, తిరుపతి, పుత్తూరు, మదనపల్లె డీవైఈవోలు ఇందిర, ఇందిరదేవి, మునీశ్వర్, లోకేశ్వర్‌రెడ్డి, ఐటీ, విద్యాశాఖ కార్యాలయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న మురళీకృష్ణ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా కొత్తగా ఎన్నికైన ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు పనిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద 260 గ్రామాలకుగాను ఎంపికైన 219 మంది ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులు, సాగు చేసే పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో రైతులందరినీ ప్రకృతి సేద్యం వైపు మళ్లించి, రసాయన ఎరువులు వాడకం తగ్గించడం ద్వారా భూసారం పెరిగి, నాణ్యమైన ఉత్పత్తులు పొందే వీలుందన్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం సేవలు స్ఫూర్తిదాయకం: డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం అజాద్ సేవలు స్ఫూర్తిదాయకమని డీఆర్వో మోహన్‌కుమార్ అన్నారు. మౌలానా జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. మౌలానా విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో విలక్షణమైన విద్యా ప్రణాళికలను అమలు చేశారన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీ నేతలు మాట్లాడుతూ మైనార్టీ, క్రిస్టియన్‌లకు ఉచితంగా విద్య అందేలా మౌలానా చూశారన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రచనా పోటీల్లో ప్రతిభవారికి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు రహమాన్, జాకీర్, అర్షద్ ఆయూబ్‌ఖాన్, కాలేష, అన్సార్‌బాషా, చిట్టిబాబు, రాజ్‌కుమార్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 11.20గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి తిరుచానూరు బాలాజీ కల్యాణ మండపంలో జరిగే బీజేపీ మహిళామోర్చా సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3గంటలకు రేణిగుంట రోడ్డులోని అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఆత్మనిర్భర్ భారత్ సెమినార్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌తో కలిసి పాల్గొంటారు. రాత్రి 7గంటలకు తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఓ వివాహానికి హాజరై తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వైజాగ్ బయలుదేరి వెళతారు.

అందరి ఆరోగ్యం కోసమే 'సంజీవని'

● కలెక్టర్ సుమిత్‌కుమార్



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసమే సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 28 మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆఫీసర్లతో సంజీవని డిజిటల్ నెర్వ్ సిస్టంపై ఒక రోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుప్పంలో ప్రారంభించిన డిజిటల్ నెర్వ్ సెంటర్ సత్ఫలితాలు ఇస్తోందన్నారు. త్వరలో జిల్లా అంతటా డిజిటల్ నెర్వ్ సెంటర్ ఒక గేమ్‌చేంజర్‌గా మారనుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆధునిక వైద్య పరిజ్ఞానాన్నీ అనుసంధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టాటా కన్సల్టెన్సీ ఎండీ రవి, డాక్టర్ సరస్వతి, డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, తిరుపతి డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తా



డీఎస్‌ఏ మెసానికల్ మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు క్రీడలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. మంగళవారం చిత్తూరు డీఎస్‌ఏ మెసానికల్ మైదానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాభివృద్ధికి కావాల్సిన కోర్సులను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని చెప్పారు. అంతేకాకుండా లక్ష్మీనగర్ కాలనీలో డీఎస్‌ఏకు చెందిన పాత ఇండోర్ స్టేడియాన్ని తొలగించి.. నూతన ఇండోర్ స్టేడియం నిర్మించేలా ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. మెసానికల్ మైదానంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు, ఇండోర్ స్టేడియం మరమ్మతులు ప్రారంభిస్తామన్నారు. చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మేయర్ అముద, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు చంద్రప్రకాష్, దొరబాబు, డీఎస్‌డీవో బాలాజి పాల్గొన్నారు.

టేకుమందలో ఏనుగుల మంద దాడి

వరి, అరటి, మామిడి పంటలకు నష్టం





ఏనుగులు తొక్కేసిన వరిని చూపుతున్న రైతులు

బంగారుపాళ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటపొలాలపై ఏనుగుల మంద దాడి చేసింది. వరి, అటరి, మామిడి పంటలకు నష్టం కల్గజేశారు. బంగారుపాళ్యం మండలంలోని టేకుమంద గ్రామ సమీపంలోని ఎగువ కామాక్షమ్మ చెరువు సమీపంలోని పంటలపై సోమవారం రాత్రి 13 ఏనుగుల మంద దాడి చేసింది. దీనిపై అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌసల్యకు చెందిన ఎకరం వరి పంట,పరిదేశికి చెందిన ఎకరం వరి, మామిడి చెట్లను, గోవిందయ్య, రేణుకమ్మలకు చెందిన ఒకటిన్నర ఎకరం వరి, అరటి చెట్లను తొక్కి నాశనం చేశాయని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం ఏనుగుదాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు వేడుకుంటున్నారు.



గజరాజులు విరిచేసిన మామిడి చెట్టు

పంటలపై కొనసాగుతున్న గజ బీభత్సం






ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట - ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో సోమవారం రాత్రి పంటలపై ఏనుగుల మంద దాడులు చేయడంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి, వేరుశనగ పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. దేశిరెడ్డిగారిపల్లిలోని రవీంద్రారెడ్డి, కేశవులురెడ్డి మామిడితోటల్లోకి చొరబడి మామిడిచెట్లను, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. సమీపంలోని నారాయణరెడ్డి, వాసుదేవరెడ్డిలకు చెందిన వరి, పనస, మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. టేకు చెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. అలాగే బాలిరెడ్డిగారిపల్లి, కమ్మపల్లి గ్రామాల్లోనూ పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగులు అడవిలోకి చేరుకున్నాయి. మంగళవారం అడవిలోని చింతలవంక వద్ద ఏనుగుల మంద సంచరించినట్లు అటవీ అధికారులు తెలిపారు.

పోలీసుల అదుపులో మహిళ హత్య కేసు నిందితుడు!



ఆరేళ్ల క్రితం హత్యకు గురైన విశ్రాంత సీహెచ్‌వో కృష్ణవేణమ్మ, దుండగుడిని ఎదురించి ప్రాణం విడిచిన విమల (ఫైల్ ఫొటోలు)

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీలో సోమవారం పట్ట పగలు జరిగిన విమల (59) అనే మహిళ హత్య కేసును పోలీసులు ఛేదిస్తున్నారు. బంగారు నగలు అపహరించేందుకు వచ్చిన వ్యక్తి 70 ఏళ్ల వృద్ధురాలిపై దాడి చేస్తుండగా ఎదురించిన మహిళ గొంతుపై పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన మండలంలో సంచలనం రేపింది. ఆ వ్యక్తి చేతిలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రి సుమారు 5 గంటల అనంతరం స్పృహలోకొచ్చి జరిగిన విషయం పోలీసులకు చెప్పింది. డాగ్ స్క్వాడ్, వృద్ధురాలు తెలిపిన కథనం మేరకు ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న స్థానికుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. 2020 జూలై 27వ తేదీ రాత్రి ఇదే

ఆరేళ్ల క్రితం ఇదే తరహాలో సీహెచ్‌వో హత్య

గ్రామంలోని విశ్రాంత సీహెచ్‌వో కృష్ణవేణమ్మ ఇంటికి బంగారు నగలను అపహరించేందుకు వచ్చిన దుండగుడు ఆమెపై కత్తితో దాడి చేయడంతో ఆమె హత్యకు గురైంది. దీనికి సంబంధించిన కేసు కోర్టులో నడుస్తోంది. గత నెల 22వ తేదీ రాత్రి సమయంలో ఇదే గ్రామంలోని డ్రైవర్ అబ్దుల్ మునాఫ్ ఇంటిలోకి చొరబడిన దొంగలు 80 గ్రాముల బంగారు నగలు అపహరించారు. అదే రోజు రాత్రి రెండు మొబైల్ దుకాణాల్లో చోరీలకు పాల్పడిన ఘటన మరువక ముందే సోమవారం మరొక హత్య జరగడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

● వరుస చోరీలు, హత్యలతో స్థానికుల్లో భయాందోళన

ఎల్లంకివారిపల్లిలో వరుస చోరీలు, హత్యలతో గ్రామంలో భయాందోళన మొదలైంది. బంగారు నగలు కోసం వచ్చిన దుండగులు ఎదురు తిరిగిన మహిళలను హత్య చేయడం, ఎవరూ లేని ఇళ్లలో బంగారు నగలు దోచుకెళ్లడం గ్రామంలో జరుగుతోంది. గతంలో ఇదే గ్రామంలో పోలీసులు ఔట్ పోస్టు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో గస్తీ చేసేవారని, ఇప్పుడు అలాంటివి ఏమీ లేకపోవడంతో ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.

కల్తీ నెయ్యిపై జగన్ సమాధానం చెప్పాలి

● శ్రీవారి లడ్డూపై భక్తుల మనోభావాలు దెబ్బతీశారు ● వైవీ సుబ్బారెడ్డిని కాపాడేందుకు మాజీ సీఎం ప్రయత్నం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):తిరుమలకు సరఫరా అయిన కల్తీ నెయ్యిపై మాజీ సీఎం జగన్ సమాధానం చెప్పాలని శాప్ చైర్మన్ రవినాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తిరుమల శ్రీవారి పవిత్రతను దెబ్బతీసిందన్నారు. పవిత్రమైన లడ్డూ తయారీలో నకిలీ నెయ్యి వినియోగించి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని చెప్పారు. కల్తీ నెయ్యి కుంభకోణంలో బాబాయి వైవీ సుబ్బారెడ్డిని కాపాడేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్‌లో భారీ గోల్‌మాల్ జరిగిందన్నారు. సొంతంగా డెయిరీ ఉండి, పాలసేకరణ, నెయ్యి , వెన్న, తయారీలో సుదీర్ఘ అనుభవమున్న కంపెనీలకు మాత్రమే ఈ టెండర్లలో పాల్గొనే అర్హత ఉన్నప్పటికీ .. ఇవేమీ పట్టించుకోకుండా కమీషన్లకోసం ఏమాత్రం అర్హతలేని వారికి కాంట్రాక్టులు ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ జగన్ హయాంలో శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు 2024 సెప్టెంబర్‌లోనే కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు. దీంతో అప్పుడే వైసీపీ నేతలు రివర్స్ డ్రామా మొదలు పెట్టారన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మాట్లాడుతూ తిరుమల వెంకన్నతో పెట్టుకున్న వారెవరూ బాగుపడిన చరిత్రలేదన్నారు.చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత,మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్,చిత్తూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు సునీల్ కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అవార్డుల ప్రదానోత్సవం



అవార్డులు పొందిన ప్రొఫెసర్లతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులదే కీలక పాత్ర అని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శనరావు అన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో మంగళవారం యూనివర్సిటీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని అటానమస్, ప్రైవేట్ కళాశాల టీచర్లకు, ప్రిన్సిపాళ్లకు, యూనివర్సిటీ ఉమెన్స్ కో ఆర్డినేటర్స్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్, వలం టీర్స్, పేటెంట్స్ యూనివర్సిటీ టీచర్స్‌కు అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు.ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు వారు సాధించిన అవార్డులు, పేటెంట్స్ గురించి వర్సిటీకి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా అధ్యాపకులు తమ దగ్గరున్న సమాచారాన్ని వర్సిటీకి అందించాలన్నారు.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల హెచ్‌ఓడీలు, సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. యూనివర్సిటీ పరిధిలో అటానమస్ కళాశాలలకు సంబంధించి బెస్ట్ టీచర్లుగా ఎన్నికైన వారికి అవార్డులను అందజేశారు. వీరిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి హరినాథ్ (వేము ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పి.కొత్తకోట), ఉమామహేశ్వరి (శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, చిత్తూరు)వున్నారు. బెస్ట్ ఉమెన్ కో-ఆర్డినేటర్‌గా రేణుకాదేవి(వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, తిరుపతి) ఎంపికయ్యారు. 30మందికి యూనివర్సిటీ పేటెంట్స్ అవార్డులు అందజేశారు.

పశుసంవర్ధక శాఖలో ఏడీలకు పదోన్నతులు

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో 24 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. వీరిలో దుత్తలూరులోని ప్రసన్న ఆంజనేయరెడ్డిని చిత్తూరు వెటర్నరీ పాలిక్లినిక్‌కు, కురిచేడులోని సయ్యద్ రసూల్‌సాహెబ్‌ను మదనపల్లెకు, రాపూరులోని అనిల్‌కుమార్‌ను తిరుపతికి, కుప్పంలోని కుమారిని తిరుపతి డీఎల్‌డీఏ ఈవోగా, తిరుపతి ఎస్వీవీయూలోని బైరాగిని విశాఖ స్మైల్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

ఒకే ఫోన్ నెంబరు...వందల అసెస్మెంట్లు

● కార్యదర్శి సస్పెన్షన్... మరో నలుగురికి షోకాజ్‌నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో కొంత మంది కార్యదర్శుల నిర్లక్ష్యం బహిర్గతమైంది. రాష్ట్ర అధికారులే ఆ విషయాన్ని గుర్తించి ఆరా తీయడంతో ఖంగుతినడం అందరి వంతయింది. ఆ నిర్లక్ష్యం తారస్థాయికి చేరినా గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు గుర్తించకపోవడం చర్చనీయాంశం అయింది. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఓ కార్యదర్శిపై సోమవారం సస్పెన్షన్ వేటు పడగా మరో నలుగురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. పన్నుల వసూళ్లకు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం స్వర్ణ పంచాయతీల పేరిట పోర్టల్‌ను రూపొందించి అసెస్మెంట్‌దారుల వివరాలను డిజిటలైజ్ చేయాలని ఆదేశించింది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొందరు కార్యదర్శులు వందల అసెస్మెంట్లకు ఒకే ఫోన్ నెంబరును నమోదు చేశారు. ఉన్నతాధికారులు రెండు రోజుల క్రితం జరిగిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో పూతలపట్టు 12కమ్మపల్లె, పరికిదొన, పానాటూరు గ్రామాల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సదుం మండలం జోగివారిపల్లె పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌వల్లి 407 అసెస్మెంట్లకు గాను 360 అసెస్మెంట్లకు ఒకే ఫోన్ నెంబరును ఇవ్వడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ విషయమై డీపీవో సుధాకరరావు మాట్లాడుతూ ఒకే నెంబరుతో అనేక మంది అసెస్మెంట్లను నమోదు చేశారని, వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● వీరికే షోకాజ్ నోటీసులు

పూతలపట్టు మండలం 12కమ్మపల్లె పంచాయతీ కార్యదర్శి 1346 అసెస్మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో 522 అసెస్మెంట్లను నమోదు చేశారు. యాదమరి మండలం 12 కమ్మపల్లె కార్యదర్శి 479 అసెస్మెంట్లకు 252, చౌడేపల్లె మండలం పరికిదొన పంచాయతీ కార్యదర్శి 447 అసెస్మెంట్లకు 306, గుడిపాల మండలం పానాటూరు పంచాయతీ కార్యదర్శి 710 అసెస్మెంట్లకు గాను 418 అసెస్మెంట్లకు ఒకే ఫోన్ నెంబరుతో నమోదు చేసినట్లు అధికారులు గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

24న కొట్టాయంకు ప్రత్యేక రైలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే భక్తుల కోసం చర్లపల్లి-కొట్టాయం మార్గంలో రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 24న 07115 ప్రత్యేక రైలు చర్లపల్లి నుంచి కొట్టాయంకు, 25న 07116 ప్రత్యేక రైలు కొట్టాయం నుంచి చర్లపల్లికి బయల్దేరుతుందని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. ఈ రైళ్లకు భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర కొండపల్లి, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు తదితర స్టేషన్లలో హాల్ట్ కల్పించినట్టు వెల్లడించారు. హైదరాబాద్-కొల్లాం మార్గంలో ప్రతి శని, సోమవారాల్లో నడుస్తున్న ప్రత్యేక (07193/07194) రైళ్లను జనవరి 19 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పం అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కుప్పం మండలం మటార్లపల్లిలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. కుప్పం సెగ్మెంట్ పరిధిలోని ప్రతి గ్రామాకి రోడ్డు సదుపాయాన్ని కల్పించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కౌశల్ పరీక్షలకు ఆనిగానూరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నేతలు

రామకుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆనిగానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కార్తీక్, తొమ్మిదో తరగతి చదువుతున్న నవీన, ఉదయశ్రీ జిల్లా స్థాయి కౌశల్ పరీక్షలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య తెలిపారు. మండస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 27, 28న నిర్వహించే కౌశల్ పరీక్షల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను మంగళవారం హెచ్ఎంతోపాటు రెస్కో మాజీ డైరెక్టర్ రామ్మూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ బీరప్ప తదితరలు అభినందించారు.

గురుకులంలో కార్తీక వన సమారాధన



మొక్క నాటుతున్న అధికారులు

రామకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం సమీపంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మంగళవారం అటవీ విభాగాధికారి హరికుమార్ అధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు అటవీ చట్టాలు, వనసంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ తదితర అంశాలపై అటవీ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీ బీట్ అధికారులు సుబ్రహ్మణ్యం, నిరంజన్‌లు, విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సర్పదోష నివారణ పూజలు



సర్పదోష నివారణ పూజలు చేయిస్తున్న పండితులు

రామకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాహుకాల సమయంలో వేదపండితులు నాగరాజశర్మ బృందం సర్పదోష నివారణ పూజలు చేయించారు. పూజల అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

కొళ్లుపల్లె కేసు వాయిదా

● చిత్తూరు కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు



చిత్తూరు కోర్టు వద్ద కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు

రామకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల క్రితం విపక్ష నేత హోదాలో చంద్రబాబు సొంత నియోజవర్గంలో పర్యటన సందర్భంగా రామకుప్పం మండలం కొళ్లుపల్లె గ్రామంలో వైసీపీ శ్రేణులు ఆ పార్టీ తోరణాలు కట్టడంతోపాటు టీడీపీ శ్రేణులపై రాళ్ల దాడి చేశారు. అప్పట్లో పోలీసులు ఏకపక్షంగా నియోజకవర్గంలోని పలువురు నేతలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఏడాది క్రితం వరకు కేసులో ఉన్న వారు కుప్పం కోర్టుకు హాజరయ్యేవారు. ఏడాది నుంచి వాయిదాలకు చిత్తూరు కోర్టుకు హాజరవుతున్నారు. అక్టోబరు నెలాఖరు వరకు ఏడుసార్లు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. తాజాగా ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు ఏడు రోజులు వాయిదాలకు చిత్తూరుకు వెళ్లారు. మంగళవారం సైతం కోర్టుకు హాజరయ్యారు. 12, 14 తేదీల్లో కోర్టుకు హాజరు కావాలని న్యాయమూర్తి తమను ఆదేశించారని వారు తెలిపారు.

పీకేఎం ఉడా కార్యదర్శికి సత్కారం



మనోహర్‌ను సన్మానిస్తున్న అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం

పుంగనూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీకేఎం ఉడా కార్యదర్శి మనోహర్‌ను పుంగనూరు అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పీకేఎం ఉడా కార్యాలయంలో ఆయన్ను కలిసి పుంగనూరు పట్టణ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుల నౌషాద్, నాసిర్, సల్మాన్, సుహైల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేయకండి

పుంగనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా ఇళ్లు, అదనపు అంతస్తుల నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మదనపల్లె మార్గంలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను నిలపాలని నోటీసులు ఇచ్చినా నిర్మాణాలు చేస్తుండగా టౌన్‌ప్లానింగ్ అధికారులు 1965 మున్సిపల్ చట్టం ప్రకారం తొలగించినట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు ఇళ్ల నిర్మాణాలకు తప్పని సరిగా మున్సిపాలిటీ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తే తొలగించి ఖర్చులను వారి నుంచే వసూళ్లు చేస్తామని తెలిపారు.

సమష్టి కృషితోనే రొంపిచెర్ల మండలాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని .. వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పల్లెల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని , తాగునీటి సమస్య లేకుండా పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు అనంతరం మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్ఎంపీపీ విజయశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కల్లూరు మండల సమావేశం

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

గృహనిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి



గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

సోమల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాయలగుట్టలోని ఎస్టీ కాలనీలో నిర్మాణంలోని గృహాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం మండలంలోని పాయలగుట్టను హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాయలగుట్టను సందర్శించి అక్కడి గృహాలను పరిశీలించి 14 పురాతన ఇళ్లకు రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. తొలి విడత రూ.70 వేలు లబ్ధిదారుల ఖాతాకు జమ చేయించారు. ఈక్రమంలోనే అధికారులు ఆ నిధుల వినియోగంపై సమీక్షించారు. పనులలో రాజీ లేకుండా నిధులు వినియోగించాలన్నారు. ఈక్రమంలోనే వీధి దీపాల ఏర్పాటు చేయించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మణికంఠ, గణేశ్, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



భాస్కర్‌ను పరామర్శిస్తున్న మాలమహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు యమలా సుదర్శనం

పుంగనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భాస్కర్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన భాస్కర్‌ను అదే గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన పెద్దఅబ్బోడు, వెంకటరమణ, గంగిరెడ్డి, జయశంకర్, శ్రీనివాసులు, రామచంద్ర దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకుంటున్నారన్నారు. నిందితులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. భాస్కర్‌కు న్యాయం జరగకపోతే చౌడేపల్లె పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు అశోక్‌కుమార్, గుండా మనోహర్, మల్లెల మోహన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుంగనూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పుంగనూరు బీఎంఎస్ క్లబ్ ఆవరణలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు నానబాల గణేశ్ తెలిపారు. తిరుపతి క్లబ్ సహకారంతో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుప్పం తిరుపతిగంగమ్మ ఆలయ కమిటీ నియామకం

కుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ప్రసన్న తిరుపతిగంగమ్మ ఆలయ కొత్త కమిటీని నియమిస్తూ రాష్ట్ర ధార్మికపరిషత్ మెంబర్ సెక్రటరీ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా రవిచంద్రబాబు, సంతోషమ్మ, వినాయకన్, మహేష్, శారదమ్మ, రాజ్‌కుమార్, నరేష్, వెన్నిల, మంజుళదేవీ, లక్ష్మీ, జ్యోతీష్‌లతోపాటు అర్చకులు సోమశేఖర్ నియమితులయ్యారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

చౌడేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. మంగళవారం రాయలపేటకు చెందిన నాగరాజు, లక్ష్మి ద్విచక్రవాహనంలో సొంత పనులు నిమిత్తం చౌడేపల్లెకు వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈక్రమంలో దాదేపల్లె సమీపంలో వారిపై కుక్కలు దాడి చేయటంతో గాయపడ్డారు. బాధితులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్సలు పొందారు.

అందని బిల్లులు..!

● మున్సిపల్ కార్యాలయం చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

● పట్టించుకోని అధికారులు



పలమనేరు మున్సిపల్ కార్యాలయం

పలమనేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయం చుట్టూ గుత్తేదారులు గత ఐదు నెలలుగా బిల్లుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. పలమనేరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కౌండిన్య నదిపై కాలువపల్లి వద్ద నిర్మించిన రిజర్వాయర్ రెండేళ్ల క్రితమే ఒట్టిపోయింది. దీంతో గత రెండేళ్లుగా ప్రజల దాహార్తి తీర్చేందుకు మున్సిపల్ అధికారులు తాగునీటిని ట్యాంకర్లతో తెప్పించి సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో మూడునెలల పాటు ఈ సరఫరా చేయిస్తున్నారు. ఈ ఏడాదీ మార్చి నెలలో తాగునీటి సమస్య తలెత్తడంతో అధికారులు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా కోసం గుత్తేదారులకు బాధ్యతలను అప్పగించారు. దీంతో గుత్తేదారులు 9 ట్రాక్టర్లను అద్దెకు తీసుకొని రోజూ 50 నుంచి 70 టిప్పులు టాంకర్లతో తాగునీటి సరఫరా చేశారు. ఏప్రిల్ 18 నుంచి మే 13 వరకు తాగునీటిని సరఫరా చేసినందుకు రూ.13,29,417, అలాగే మే 14 నుంచి మే 31 వరకు సరఫరా చేసినందుకు గాను రూ.10,69,938 మున్సిపాలిటి చెల్లించాల్సి ఉంది. దీంతో గుత్తేదారులు బిల్లుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తాము అద్దెకు తీసుకొని, డీజిల్ కోసం అప్పులు తెచ్చి తాగునీటిని సరఫరా చేశామని... నెలలు గడిచిపోతున్నా బిల్లులు చెల్లించకపోవడంతో తాము అప్పులు చేసి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అందరి ఆమోదంతోనే రాయలపేటలో రహదారి విస్తరణ



రాయలపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపేట గ్రామంలో రహదారి విస్తరణ పనులు అందరి ఆమోదంతోనే జరుగుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మంగళవారం రాయలపేట గ్రామస్తులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిశారు. ఇరుకైన రోడ్డు కారణంగా గ్రామంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని విన్నవించారు. పలమనేరు-చౌడేపల్లె - పుంగనూరు మార్గాలకు మధ్యలో రాయలపేట గ్రామం ఉండటంతో వాహన రాకపోకలు అధికంగా ఉన్నాయని.. వాహనదారులు, పాదచారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయించారు. అయితే గ్రామస్తులు కొందరు వ్యతిరేకించడంతో పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణ పనులకు ప్రత్యేక చొరవ తీసుకుని రూ.4.4 కోట్లు మంజూరు చేయించామన్నారు. అయితే ఈ పనులు ప్రారంభించాలన్నా గ్రామస్తుల ఆమోదం తప్పకుండా ఉండాలన్నారు. తమకు ఎటువంటి అభ్యంతరం లేదని గ్రామస్తులు తెలపడంతో త్వరలో రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

పాలార్లపల్లెలో ఎఫ్ఎఫ్‌సీ పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్కును అందుబాటులోకి తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం కుప్పం నియోజకవర్గంలోని పాలార్లపల్లెలో రూ. 15.66 కోట్లతో ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లోటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కుప్పం నుంచి టీడీపీ నేతలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికో ఓ ఎంఎస్ఎంఈ పార్కును తీసుకొచ్చి ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే ఉతడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ శెల్వరాజ్, కుప్పం మునిసిపల్ టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన చౌడేపల్లె మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం.. అమినిగుంటకు చెందిన గుర్రప్ప కుమారుడు రాజేష్ కుటుంబ కలహాలతో మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరిశ్రమల పార్కుతో యువతకు ఉద్యోగావకాశాలు

టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి




శంకుస్థాపనలో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివారులోని చదళ్ల వద్ద ఎంఎస్ఎంఈ పార్కులో ఏర్పాటు చేసే పరిశ్రమలతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం చదళ్ల సమీపంలోని 197/21 సర్వే నంబర్‌లోని 21.80 ఎకరాల స్థలంలో ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కును సీఎం చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో ఉపాధి, పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 17 జిల్లాల్లో 50 చోట్ల 900 ఎకరాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి రూ.810 కోట్ల పెట్టుబడులతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. చదళ్లలో చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పరిశ్రమలు బయట రాష్ట్రాలకు తరలిపోతే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో కొత్తపరిశ్రమలు స్థాపించడానికి వ్యాపార, పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని వివరించారు. త్వరలో పరిశ్రమలకు టెండర్లు పిలిచి నిర్మాణాలు పూర్తి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీవో భవాని, తహసీల్దార్ జే.రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్ఐ ఫణికుమార్, సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ, టీడీపీ నాయకులు ఉయ్యాల రమణ, మాధవరెడ్డి, ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీసుగిరి, వెంకటరెడ్డి, రత్నమ్మ, సుహేల్‌బాషా, ఇబ్రహీం, రామకృష్ణనాయక్, సద్దాహుసేన్, ఐటీడీపీ కుమార్, చైతన్యరాయల్, సుబ్రహ్మణ్యం, హరి తదితరులు పాల్గొన్నారు.



రాశీ వనంలో కార్తీక దీపాల వెలుగులు

రామకుప్పం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళావారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రికి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ఆలయం వద్ద, వెనుకన గల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయంతో బాటూ, వనాలు దేదీప్యమానంగా వెలుగులను సంతరించుకున్నాయి. ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.



ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

కల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. పులిచెర్ల మండలం కేకేపేట నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత విద్యా వ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కిందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **సోమల:** సోమల జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈక్రమంలోనే మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూజలు చేశారు. ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కుప్పం:** కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీనాగరాజు పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీఎన్ విద్యా సంస్థల వైస్‌చైర్మన్ సునీల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్‌ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్ అండ్ డీ డైరెక్టరు కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాధవన్, కో-ఆర్డినేటర్ గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. .

● **పుంగనూరు రూరల్:** స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్, అధ్యాపకులు కె.అనిల్‌కుమార్, డాక్టర్ పవిత్ర, షామిదాబాను, విద్యారులు తదితరులు పాల్గొన్నారు.



కుప్పంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీనాగరాజు



సోమలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్

టీడీపీని బలోపేతం చేస్తూ.. ప్రజల్లోకి వెళతాం

- నూతన పదవులు పొందిన చిత్తూరు నియోజకవర్గ నాయకులు
- ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీని బలోపేతం చేస్తూ.. ప్రజల్లోకి వెళతామని నూతనంగా పదవులు పొందినవారు తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల, మండల క్లస్టర్, టౌన్, యూనిట్, అనుబంధ కమిటీల కార్యవర్గాల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేశ్‌ల ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అబివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పదవులు వచ్చినవారు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు సునీల్ కుమార్, మేయర్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్బానాయుడు, నేతలు చంద్రప్రకాష్, నగర కమిటీ అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, పలు అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి విద్య అవశ్యం

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి, నాగరిక సమాజ నిర్మాణానికి విద్య అవశ్యమని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు లతా, సుబ్బారావు, హరిబాబు, జోగిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అబుల్ కలాం అజాద్‌కు నివాళి



అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి ఎస్పీ తుషార్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల రెవెన్యూ సమస్య పరిష్కారం



ఆలపాకంలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

విజయపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆలపాకం దళితవాడలో 25 ఏళ్ల రెవెన్యూ సమస్యను మంగళవారం తహసీల్దార్ కిరణ్ పరిష్కరించారు. పిచ్చయ్య, కన్నయ్య మధ్య ఇంటి జాగా విషయమై వివాదం నెలకొంది. జాగాను రిజిస్టరు చేయకుండా అగ్రిమెంటు ద్వారా క్రయ, విక్రయాలు చేయడంతో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లా సర్వేయర్ కూడా రెండు పర్యాయాలు సర్వే నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై రెవెన్యూ సదస్సు, పీజీఆర్ఎస్‌లో పిచ్చయ్య ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోనే ఇరువర్గాలతో గ్రామంలోనే తహసీల్దార్ సమావేశం పెట్టారు. కన్నయ్య కుటుంబీకులు ఆక్రమించుకున్న ఇంటి జాగాకు బదులు సమీపంలోనే రెండు సెంట్లు కేటాయించి, సమస్యను పరిష్కరించారు. మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వోలు చిదంబరం, విజయ్, సర్వేయర్ హరీష్, నాయకుడు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: వృద్ధుడి మృతి



బోల్తా పడిన ఆటో - మహేంద్ర మృతదేహం

నిండ్ర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగలాపురం మండలం నందనం ఆది ఆంధ్రవాడకు చెందిన మహేంద్ర (65) తమ బంధువైన ఆటోడ్రైవర్ కుటుంబంతో కలిసి మొత్తం తొమ్మిది మంది నగరి దేశమ్మ గుడికి మంగళవారం ఆటోలో బయల్దేరారు. అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం తిరిగి ఇంటికి బయల్దేరారు. నెట్టేరి క్రాస్ వద్దకొచ్చేసరికి అక్కడున్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో మహేంద్ర మృతి చెందగా, ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బంగారుపాళ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాకాహారంతోనే మానవుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ బంగారుపాళ్యం సభ్యులు తెలిపారు. మంగళవారం బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ జయంతిని సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని 16 పిరమిడ్ కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున సభ్యులు పాల్గొన్నారు. హైదరాబాద్ కైలాస్‌పురికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి, సంగీతబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్‌లో అరకొర వసతులు

ఇబ్బంది పడుతున్న వైద్య సిబ్బంది

గుడిపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఎల్ పురం బీసీ కాలనీలో ఉన్న సబ్ సెంటర్‌లో అరకొర వసతుల నడుమ వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్ల కిందట కొత్త భవన నిర్మాణం చేపట్టినా ఇంకా అసంపూర్తిగానే ఉంది. కిటికీలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు లేవు. మందులను కూడా సమీప ఇళ్లలోని ఫ్రిజ్‌లలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇకనైనా వసతులు కల్పించాలని వైద్య సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.



బురదతో నిండిన పుల్లూరు, వెంకటాపురం, పిల్లిగుండ్లపల్లె రోడ్లు

అధ్వానంగా మారిన రోడ్లు

ఇబ్బంది పడుతున్న వాహనదారులు

శ్రీరంగరాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలకారణంగా మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. దీనివల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుల్లూరు ఎస్టీ కాలనీ నుంచి పుల్లూరు క్రాస్ రోడ్డు, పద్మాపురం, రాఘవరాజపురం తారురోడ్డు కంకరరాళ్లు తేలాయి. కట్టికపల్లి నుంచి పిల్లిగుండ్లపల్లె ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డుపై వర్షపునీరు నిలిచి, బురదమయంగా మారింది. మంగుంట నుంచి ఆళ్లమడుగు వెళ్లే తారురోడ్డు గుంతలమయంగా మారింది. పెద్ద తయ్యూరు నుంచి శెట్టివానత్తం గ్రామ సచివాలయానికి వెళ్లే రోడ్డుపై అనేక చోట్ల గోతులు ఏర్పడగా, మురుగు నిల్వ ఉంది. వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నెరవేరిన నగరి ప్రజల కల

మాంగాడు వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మాంగాడు గ్రామం సమీపంలో ఏపీఐఐసీ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రారంభించారు. ఈ పార్కు ప్రారంభంతో నగరి ప్రజల కల నెరవేరిందని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా తాగునీరు కలుషితమయ్యే సమస్య తీరే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఇక్కడ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అంగీకరించారు. ఇందులో చేనేత మరమగ్గ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అలాగే ఈ ప్రాంతంలో స్త్రీలు అధికంగా కుట్టు మిషన్లపై ఆధారపడి ఉన్నారని, వారికి కూడా ఉపాధి కల్పించినట్లు అవుతుందని తెలిపారు. నగరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు తర్వాత చిన్న చిన్న పరిశ్రమలకు స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. ఆర్డీవో అనుపమ, తహసీల్దార్, ఎంపీడీవో వాణి, కమిషనర్ కృష్ణారెడ్డి, ఏపీఐఐసీ తరపున సయ్యద్, పరిశ్రమల శాఖ తరపున మునినాథుడు, టీడీపీ నాయకులు గుణశేఖర్, జోహార్‌రెడ్డి, బాలాజి, సురేష్ నాయుడు, వరదరాజులు, నారాయణస్వామి నాయుడు, శివకుమార్‌రెడ్డి, ఆనంద్, శ్రీను రాజు, వడివేలు, శ్రీనివాసులు మొదలి, చిట్టి, దశరథవాసు పలువురు నాయకులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంత్రి సిఫార్సు

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ చొరవతో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి మహర్దశ పట్టనుంది. థామస్ సూచనలతో వ్యక్తిగత కార్యదర్శులు చంద్రశేఖర్, రామచంద్రరాజు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అమరావతిలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికను అందజేశారు. దీనిపై మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. ఆ మేరకు వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల మైదానాల్లో మినీ క్రీడా మైదానాల ఏర్పాటు. నియోజకవర్గానికి నూతనంగా పది బస్సు సర్వీసుల సదుపాయం. తుపాను కారణంగా దెబ్బతిన్న రహదారులు, ప్రధాన చెరువుల పునరుద్ధరణకు పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల్లో రూ.275 కోట్ల నిధులకు మంత్రి సిఫారసు చేశారు.

దాడిపై ఇరువర్గాల ఫిర్యాదులు

వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం అప్పాచారి వీధికి చెందిన ప్రమీలమ్మ(60), గుర్రప్ప(65)పై ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచారు. ఈనెల 9వ తేదీ రాత్రి అదే వీధికి చెందిన బి.వెంకటేష్, అతడి భార్య పుష్ప, కుమార్తెలు దీపిక, మమత తమపై దాడి చేసి గాయపరచారని ప్రమీలమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ట్రైనీ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. అలాగే ప్రమీలమ్మ, గుర్రప్ప తమపై దాడిచేశారని బి.పుష్ప కూడా ఫిర్యాదు చేయడంతో వృద్ధ దంపతులపైనా కేసు నమోదైంది.

వైభవంగా అయ్యప్ప పడికట్టు పూజ



గుడిపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె పంచాయతీ కోలావూరులో మంగళవారం అయ్యప్ప పడికట్టు పూజను గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఉదయ మధుసూదన్‌నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొళ్లుపల్లె కేసు వాయిదా

- చిత్తూరు కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు



చిత్తూరు కోర్టు వద్ద కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలు

రామకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల క్రితం విపక్ష నేత హోదాలో చంద్రబాబు సొంత నియోజవర్గంలో పర్యటన సందర్భంగా రామకుప్పం మండలం కొళ్లుపల్లె గ్రామంలో వైసీపీ శ్రేణులు ఆ పార్టీ తోరణాలు కట్టడంతోపాటు టీడీపీ శ్రేణులపై రాళ్ల దాడిచేశారు. అప్పట్లో పోలీసులు ఏకపక్షంగానియోజకవర్గంలోని పలువురు నేతలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఏడాది క్రితం వరకు కేసులో ఉన్న వారు కుప్పం కోర్టుకు హాజరయ్యేవారు. ఏడాది నుంచి వాయిదాలకు చిత్తూరు కోర్టుకు హాజరవుతున్నారు. అక్టోబరు నెలాఖరు వరకు ఏడుసార్లు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. తాజాగా ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు ఏడు రోజులు వాయిదాలకు చిత్తూరుకు వెళ్లారు. మంగళవారం సైతం కోర్టుకు హాజరయ్యారు. 12,14 తేదీల్లో కోర్టుకు హాజరు కావాలని న్యాయమూర్తి తమను ఆదేశించారని వారు తెలిపారు.

రోడ్డుపై నీటి నిల్వ సమస్యకు పరిష్కారం



ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువలోని పిచ్చి మొక్కల తొలగింపు

పెనుమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పెనుమూరు నుంచి చిత్తూరుకు వెళ్లే మార్గంలో మఠంపల్లె వద్ద రోడ్డుపైనే నీరు నిలిచింది. దీనివల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడంతో మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు చొరవ తీసుకుని తన సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి సమస్యను పరిష్కరించారు.

గాయపడ్డ వానరానికి చికిత్స



బంగారుపాళ్యం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన ఆదినారాయణ, నాగేంద్రబాబు ఆటోలో చిత్తూరు నుంచి మంగళవారం వస్తున్నారు. పాలేరు ఫ్లైఓవర్ వద్దకొచ్చేసరికి కారు ఢీకొనడటంతో ఓ వానరంగా గాయపడటాన్ని వీరు గమనించారు. దాన్ని తమ ఆటోలోనే స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లారు. పశువైద్యుడు డాక్టర్ ఆసీఫ్ చికిత్స చేశారు. అది కోలుకున్నాక ఫ్లైఓవర్ వద్దకు తీసుకొచ్చి అక్కడున్న వానరాల గుంపులోకి విడిచిపెట్టారు. వీరిద్దరూ స్థానికులు అభినందించారు.

శ్మశాన సమస్యకు పరిష్కారం



సమస్యను పరిష్కరిస్తున్న ఆర్ఐ హరి తదితరులు


వెదురుకుప్పం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ చొరవతో 50 ఏళ్లుగా నలుగుతున్న శ్మశాన సమస్య పరిష్కారమైంది. కార్వేటినగరం మండలం అన్నూరు పంచాయతీ చౌటూరు గ్రామ శ్మశానానికి హద్దులు, దారి లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ఆదివారం చౌటూరుకు వచ్చిన థామస్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ నరసింహులును ఆదేశించారు. మంగళవారం అధికారులొచ్చి గ్రామస్తుల సమక్షంలో సర్వే నెంబరు 182/15, ఎల్‌పీఎం నెంబరు 332లో ఉన్న 12.50 సెంట్ల శ్మశాన స్థలానికి హద్దులు చూపి, దారి వసతి కల్పించారు. ఇన్నేళ్ల సమస్య పరిష్కారం కావడంపై థామస్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్వో మోహన, సర్వేయర్ మార్కొండయ్య, సర్వేయర్ నేతాజి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

చౌడేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. మంగళవారం రాయలపేటకు చెందిన నాగరాజు, లక్ష్మి ద్విచక్రవాహనంలో సొంత పనులు నిమిత్తం చౌడేపల్లెకు వచ్చి తిరుగ ప్రయాణం అయ్యారు. ఈక్రమంలో దాదేపల్లె సమీపంలో వారిపై కుక్కలు దాడి చేయటంతో గాయపడ్డారు. బాధితులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్సలు పొందారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీ మోహన్



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీ మోహన్ తదితరులు

తవణంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ దగ్గుమళ్లప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్‌అన్నారు. మంగళవారం తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘాల సభ్యులకు మహిళా మార్టు లాభాలు, బ్యాంక్ లింకేజ్ రుణాలకు సంబంధించిన రూ.78,74,00,000 చెక్కును ఎంపీ, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తవణంపల్లె మహిళా మార్టు రూ.16లక్షల మూలధనంతో ప్రారంభమైన నేడు రూ.26 లక్షలు నికర లాభం సాధించడం గొప్ప విషయమన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. మండలంలో మునగడ్రైయర్ యూనిట్‌ను రూ.40లక్షలతోఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, కాణిపాకం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మణి నాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, ఐరాల, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు హరిబాబు, ధరణినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోహన్ నాయుడు, ప్రవీణ్ నాయుడు, సింగిల్‌విండో చైర్మన్లు అమరేంద్ర నాయుడు, రంజిత్ రెడ్డి, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏపీవో రవి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

పాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకునేటప్పటి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రిన్సిపాల్ హేమలత సూచించారు. మంగళవారం కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు వినాయకం, రమ్యసుశీల,భారతి పాల్గొన్నారు.

విశ్రాంత టీచర్ శ్యామలాదేవి మృతి



శ్రీరంగరాజపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి గ్రామానికి విశ్రాంత టీచర్ వడ్లపట్ల శ్యామలాదేవి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఈమె స్పందన ఫౌండేషన్ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ప్రతి ఏడాది ఉచిత పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడమేకాక పలు సేవా కార్యక్రమాలు చేసేవారు. అనురాధ అనే కలం పేరుతో పలు కవితలు రాశారు. ఈమె కవితల్లో అమ్మకు వందనం, జీవిత సత్యాలు, జీవన సౌరభాలు ప్రాచుర్యం పొందాయి. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పీపీపీ విధానాన్ని నిరసిస్తూ సంతకాల సేకరణ

నగరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను పీపీపీ విధానానికి మార్చడంపై నిరసన వ్యక్తం చేస్తూ వైసీపీ నాయకులు మాంగాడు గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు తిరుమలరెడ్డి, కన్నియప్ప, డిల్లీ, సర్పంచ్ రవికుమార్, భాస్కర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, సురేష్, శ్రీనివాసులురెడ్డి, వడివేలు, దాసరాజ్‌రెడ్డి, శేఖర్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



పాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్ క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన యువరాజు రూ.35వేల క్రీడాసామగ్రిని మంగళవారం వితరణ చేశారు. దాతను హెచ్ఎం మురళీకృష్ణ, పీఈటీ మహ్మద్ రఫీ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యాసామగ్రి పంపిణీ



చిత్తూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యాలయంలో అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. మైనార్టీ విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి పంపిణీ చేశారు. నాయకులు జ్ఞాన జగదీశ్, ఆనూ, అఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి..

కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కూడా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు.